కథ

# థాంక్యూ, మామయ్యా!

ప్రఫుల్ల చంద్ర



వేకువజామున నాలుగు గంటలకు ఆటోలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కి వెళ్తున్న నారాయణ, రోడ్డు ఊడ్చుతున్న వ్యక్తిని చూసి షాక్ అయి ఆటోని ఆపి పరుగున వెనక్కి వచ్చి ''జగన్నాథం! నువ్వా? నువ్వేనా?!'' దిగ్భ్రాంతిగా అడిగాడు.

చేస్తున్న పని ఆపి ''నేనే నోడాట్'' నవ్వేశాడు జగన్నాథం.

నారాయణ దిగ్భ్రాంతి నుంచి తేరుకోక ముందే–

''అర్జెంట్ పని మీద వెళ్తున్నావు కాబోలు, వెళ్ళి తిరిగొచ్చేటపుడు మా ఇంటికి రా'' అంటూ అడ్రస్ చెప్పి తన పనిలో నిమగ్నమయ్యాడు జగన్నాథం.

చిన్న కూతురు పెళ్లి ముహూర్తం ఫిక్స్ చేయడానికి వియ్యాలవారింటికి వెళ్తున్న నారాయణ ఆలోచనలో పడ్డాడు. ఇప్పుడు బస్సు మిస్సయితే మరో రెండు గంటలకు గాని లేదు. అప్పటికి దుర్ముహూర్తం వచ్చేస్తుంది. విధిలేక ఆటో ఎక్కేసి బస్సులో కిటికీ ప్రక్కసీటులో కూలబడి ఆలోచనల్లోకి జారిపోయాడు.

జగన్నాథం మొదట తనకి మిత్రుడు. తరవాత వియ్యంకుడు. రెండేళ్ళ క్రితం వాళ్ళబ్బాయి రామంతో తన పెద్ద కూతురు వందన పెళ్ళి జరిగింది. అప్పుడు రామం ఒక ప్రైవేటు బ్యాంక్ మేనేజర్. వాళ్ళు విజయవాడలో ఉండేవారు.

తల్లిదండ్రుల్ని మరపించే అత్తమామలు, దేవుడు లాంటి భర్త దొరికారని వందన పొగడుతోంటే నారాయణ దంపతులు మురిసిపోయారు. ఆడపిల్ల తల్లిదండ్రులు అంతకంటే కోరుకునేదేముంటుంది?

కానీ తన భార్య జగదాంబ అంత కంటే ఎక్కువే కోరుతోందని చాలా కాలానికి గాని అర్థం కాలేదు నారాయణకు.

రాష్ట్రవ్యాప్త కుటుంబాల సర్వే నిర్వహిస్తే ఆడవారు అబలలు కానేకాదనీ, స్వార్థంలో, ఎత్తుకు పై ఎత్తులు వేయడంలో, నక్కజిత్తు రాజకీయ నాయకుల్ని మించిపోయే స్త్రీల సంఖ్య ఎక్కువేమీ కాదని తెలుస్తుంది. వాళ్ళు భర్తల్ని కొంగున ముడితో బిగించి ఊపిరాడకుండా చేయగలరు. కుటుంబాల్ని విచ్ఛిన్నం చేయగలరు. భర్తని అతని తల్లిదండ్రుల నుంచి అలవోకగా వేరు చేయగలరు.

ఆ కళ జగదాంబలో పుష్కలంగా ఉందని చాలా ఆలస్యంగా గుర్తించాడు తను. మొదట తన తల్లిదండ్రులు, ఆ తర్వాత తమ్ముడు, చెల్లి ఎందుకు ఇల్లు విడచి వెళ్ళి పోయారో బిజీలో తనకు అర్థం కాలేదు. అర్థం అయి చేతులు కాలాక ఆకులతో ప్రయోజనం లేదని నోరు మూసుకొని భార్యా విధేయుడన్న బిరుదు మోస్తూ బంధు విరోధిగా ఒంటరిగా మిగిలిపోయాడు.

రోడ్లు ఊడ్చే దుస్థితికి వియ్యంకుడిని దిగజార్చినది తన భార్యే అన్న అనుమానం నారాయణ హృదయాన్ని తొలిచి వేస్తున్నది. అల్లుడీ విషయాన్ని గుర్తించి ఉండడు. ఎందుకంటే అతడు విజయవాడలో ఉద్యోగం వదిలేసి విశాఖలో కొత్త ఉద్యోగంలో చేరాడు. అక్కడ తన సమర్థత నిరూపించుకోడానికి ఆఫీసులో అహోరాత్రాలు కష్టపడుతూ కుటుంబ విషయాలు పట్టించుకోడు.

క్షణం తీరిక లేని ఏ భర్త అయినా భార్య చెప్పే కథల్ని ఇట్టే నమ్మేస్తాడు. పకడ్బందీ స్క్రీన్‌ప్లే, దర్శకత్వాల్లో జగదాంబ సిద్ధహస్తురాలు. కోడల్ని కన్నబిడ్డలాగ చూసుకున్న జగన్నాథం దంపతులను వారి కొడుకు నుంచి దూరం చేసిన పాపం ఖచ్చితంగా జగదాంబదే. ఇప్పుడు చిన్న కూతురు ద్వారా కొత్త వియ్యంకుని కుటుంబం విచ్ఛిన్నం చేస్తుంది కాబోలు! నారాయణ హృదయం అల్లకల్లోలం అయింది.

★★★

పంతులుగారి చేత మూడు ముహూర్తాలు పెట్టించి వాటిలో ఒకదాన్ని వియ్యాలవారు ఆమోదించాక క్షణం ఆలస్యం చేయకుండా వెంటనే కాకినాడకు బయలుదేరి సాయంకాలం నాలుగు కల్లా మిత్రుని ఇల్లు చేరుకున్నాడు నారాయణ. అసలు విషయం చెప్పక తప్పలేదు జగన్నాథం దంపతులకు.

★★★

కోడలి రాకతో జగన్నాథం దంపతులకు కూతురు లేని లోటు తీరింది కాని ఆ ఆనందం ఒక సంవత్సరమే. ఆ తర్వాత వియ్యపురాలి రాకపోకలు, కూతురికి హితబోధలూ ఎక్కువై వందన పెడసరంగా మారింది. రామం విశాఖలో ఉద్యోగంలో చేరాక వందన వైఖరి పరాకాష్ఠకు చేరింది.

వేళాపాళా లేకుండా ఆమె ఫ్రెండ్స్ రావడం, బెడ్‌రూంలో చేరి ఇకఇకలు, పకపకలూ ఇంటి పని ఎగగొట్టి వందన అత్తగారికి టిఫిన్ ఇది చెయ్యి, అది వద్దు, రెండు టీలు మూడు కాఫీలు పట్టుకురా అని ఆర్డర్లు వేయడం.

**క్షణం తీరిక లేని ఏ భర్త అయినా భార్య చెప్పే కథల్ని ఇట్టే నమ్మేస్తాడు. పకడ్బందీ స్క్రీన్‌ప్లే, దర్శకత్వాల్లో జగదాంబ సిద్ధహస్తురాలు. కోడల్ని కన్నబిడ్డలాగ చూసుకున్న జగన్నాథం దంపతులను వారి కొడుకు నుంచి దూరం చేసిన పాపం ఖచ్చితంగా జగదాంబదే. ఇప్పుడు చిన్న కూతురు ద్వారా కొత్త వియ్యంకుని కుటుంబం విచ్ఛిన్నం చేస్తుంది కాబోలు! నారాయణ హృదయం అల్లకల్లోలం అయింది.**

వందన ఫ్రెండ్స్ దృష్టిలో అత్తమామలు ఇంట్లోంచి తక్షణం తగలేయవలసిన అనవసర వ్యక్తులు ముసలి కంపు.

టిఫిన్ ఇచ్చి వెళ్తున్న రుక్మిణమ్మ వినేటట్టు ''ఈ ముసలిదాన్ని ఎలా భరిస్తున్నావే! తగలేయలేకపోయావా?'' అని అడిగిందొక ఫ్రెండ్.

''నేనూ అదే ఆలోచిస్తున్నా గాని ఆయనొక శుద్ధ బుద్ధావతారం. తల్లిచాటుబిడ్డ. ఈమెను తగలేస్తే ఆయన ఏడుస్తారు'' నవ్వేసింది వందన.

ఆమె ఏదో బూతు సలహా చెప్పింది కాబోలు అందరూ ఘొల్లున నవ్వేశారు.

''జంతువులు కూడా సంతానాన్ని కొంత కాలమే సాకి తర్వాత దూరంగా పోతాయి. కానీ బుద్ధిలేని మనుషులే జీవితాంతం కొడుకుల్ని పట్టుకొని వేలాడుతారు. తమ ఆనందం కోసం బిడ్డల్ని కని గొప్పత్యాగాలు చేస్తున్నట్టు ఫోజులు పెట్టి ఆ త్యాగాలకు ప్రతిఫలం కోసం కొడుకుల్ని పీక్కుంటారు. అత్తమామల కంటే కుక్కలు నయం. పెట్టింది తిని పడిఉంటాయి. అది కావాలి, ఇది కావాలని డిమాండ్ చెయ్యవు'' రుక్మిణమ్మ వినాలనే కాస్త గట్టిగా అంది మరొక ఫ్రెండ్. కోడలితో సహా అందరూ నవ్వేశారు.

విశాఖలో ఇల్లు దొరకగానే రామం ఫోన్ చేశాడు. ముహూర్తం నిర్ణయించి వారంరోజులు ముందుగానే సామాను ప్యాక్ చేసే నెపంతో జగదాంబ వచ్చేసింది.

అక్కరలేని మనుషులుగా కోడలితో సహజీవనం ఇష్టం లేక పుట్టి పెరిగిన ఊరు, స్వగృహం విడచి రాలేమని చెప్పేశారు జగన్నాథం దంపతులు. బోలెడు విచారం నటించి వందన, జగదాంబ సామాను లారీలో వెళ్ళిపోయారు. భారమైన హృదయాలతో శూన్యనందనంలో బొమ్మల్లాగా ఉండిపోయారు జగన్నాథం దంపతులు.

కానీ జ్ఞాపకాల రంపపు కోతను భరించలేక ఇంటిని అద్దెకిచ్చేసి ఆరునెలల క్రితమే కాకినాడకు వచ్చేశారు. అన్నీ అనుభవించి జీవిత చరమాంకంలో ఉన్న తాము ఎంతో అనుభవించవలసిన కొడుకు కాపురంలో కలతలు రేపడం ఇష్టం లేక ఎప్పుడు మొబైల్‌లో మాట్లాడినా తాము విజయవాడలోనే హాయిగా ఉన్నట్లు భ్రమింప జేసేవారు. రామంకిగాని, నారాయణకుగాని సందేహమే కలగలేదు.

అయితే కాకినాడలోనూ వారి హృదయభారం తీరలేదు. జ్ఞాపకాల దాడి ఆగలేదు. పనిలేని మెదడులో దయ్యాలు నృత్యం చేస్తాయి. ఖాళీగా కూర్చుని దయ్యాలను ఆహ్వానించే కంటే ఏదో పని కల్పించుకొని బిజీగా ఉండాలని నిర్ణయించుకున్నారు.

విద్యార్థి దశనుంచీ జగన్నాథంకి నవలలు కొని చదవడం అలవాటు. ఆయన వద్ద చాలా నవలలున్నాయి. మరికొన్ని నవలలూ, పత్రికలూ కొని వాటిని అద్దెకిచ్చే లెండింగ్ లైబ్రరీ ప్రారంభించినా రాబడి సంతృప్తికరంగానే ఉంది.

ఇంటి నిండా పుస్తకాలుండడంతో రుక్మిణమ్మ వాటిని చదవడం, భర్తతో చర్చించడం, ఆయన సహకారంతో కథలు, వ్యాసాలూ రాసి పత్రికలకు పంపడం అలవరచుకుంది. కొన్ని రచనలు ప్రచురించబడ్డాయి కూడా.

వార్ధక్యం వల్ల జగన్నాథానికి వేకువజాము మూడు గంటలకే మెలకువ తర్వాత నిద్రపట్టడం లేదు. జ్ఞాపకాల దాడిలో అతలాకులం అయేకంటే ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకోడానికి కలిసి వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని వీధులు ఊడ్చేపనిలో చేరాడు జగన్నాథం.

పొడవాటి కర్ర చివర త్రిభుజాకారంలో అమర్చిన వెదురుపుల్లల చీపురుతో నడుం వంచకుండా చెత్తను ఊడ్చి ఐదుగజాలకొక పోగు పెట్టడమే ఆయన డ్యూటీ. వేకువ జాము నాలుగు నుంచి ఏడు వరకూ మూడు గంటలే పని. ఆ చెత్త పోగుల్ని ఎత్తి ట్రాక్టర్‌లో పడేయడం మరొకరి డ్యూటీ.

''ఈ పని అగౌరవంగా, అవమానంగా భావించడం లేదు. పెద్దగా కష్టపడనక్కర లేదు. కాస్త వ్యాయామం కూడా, అదీకాక మరో ప్రయో

జనమూ ఉంది. ఊడ్చేవాళ్ళందరూ నా ఫ్రెండ్స్ అయ్యారు. మేము చనిపోతే మా శవాన్ని వాళ్ళు ఫ్రీగా చెత్త ట్రాక్టర్‌లో తీసుకుపోయి ఊరు చివర చెత్త గుట్టలో పడేస్తారు. ఎవరికీ ఖర్చు ఉండదు, శ్రమా ఉండదు'' ఎంతో తేలికగా జోక్‌లాగా చెప్పబోయిన జగన్నాథం గొంతు వణికింది. కన్నీళ్ళు తిరిగాయి.

ఆయన చెప్పిన కథంతా విన్న నారాయణ మనసు కలుక్కుమంది. అంతలోనే ఆయన మస్తిష్కంలో ఏదో ఆలోచన తళుక్కుమంది.

★★★

చిన్న కూతురు పెళ్ళికి ముహూర్తం ఫిక్స్ అయిన విషయం అల్లుని ఇంట ఉన్న భార్యకు చెప్పడానికి మర్నాడుదయమే విశాఖకు బయలుదేరాడు నారాయణ.

విశాఖలో బస్సు దిగి ముందుగా ఆఫీసుకెళ్ళి అల్లుడితో సుదీర్ఘంగా చర్చించి ఇంటికెళ్ళాడు. సరిగ్గా నెలరోజుల్లో ముహూర్తం అని తెలియగానే జగదాంబ, వందన ఎంతో ఆనందించారు. వెంటనే రమ్మని భర్తకి ఫోన్ చేసింది వందన. కాని అతగాడు సాయంకాలం నాలుగుకి పనులు తెముల్చుకొని ఇంటికొచ్చాడు.

పదకొండు గంటలకు ఫోన్ చేస్తే ఇప్పుడా రావడం అని మృదువుగా భర్తని కోప్పడి చెల్లి పెళ్ళి విషయం చెప్పింది వందన.

''అయితే అతగాడిని తల్లిదండ్రుల నుంచి వేరు చేయడానికి మీ అమ్మ ఇప్పటి నుంచే పథకాలు రెడీ చేసుకోవాలన్నమాట'' అనేసి బాత్‌రూం వైపు వెళ్లిపోయాడు. అతని ప్రతిస్పందన అందరికీ షాక్ ఇచ్చింది.

రామం స్నానం చేసి పైజమా, లాల్చీ ధరించి నిర్లిప్తతగా వచ్చి సోఫాలో కూర్చోగానే మీరిందాక ఏమన్నారని భర్తని నిలదీసంది వందన.

నిదానంగా ఆమె వైపు చూసి ''మనిషివై పుట్టి జంతువుల జీవన విధానాన్ని మెచ్చుకునే నీ కర్థం కాలేదా? కొంతకాలం సాకిన తర్వాత జంతువులు సంతానాన్ని ఒదిలేస్తాయి. అదే విధంగా తల్లిదండ్రులు కొడుకుల్ని విడిచిపెట్టి దూరంగా ఉండాలని నువ్వూ, మీ అమ్మా సూత్రీకరించారు కదా! ఒక వేళ వాళ్ళు విడిచి వెళ్ళకపోతే అవమానించి తగిలేయడానికి పథకాలు కూడా ఉన్నాయి కదా మీ వద్ద. జంతు విధానం మంచిదైతే మీ అమ్మ నిన్ను పట్టుకొని వేలాడుతుంది ఎందుకు? నువ్వు నా దగ్గర ఉంటున్నావెందుకు? పెళ్ళి ఎందుకు? విందులెందుకు? జంతువుల్లాగ నీ చెల్లిని వీధిలో వదిలెయ్. ఎవడో వచ్చి కొంతకాలం అనుభవించి వదిలేస్తాడు. తర్వాత ఇంకోడు, మరోడు. అదే కదా జంతువిధానం?'' ఖంగుమంది రామం స్వరం. షాక్ మీద షాక్.

అతనిలో అంత కోపం ఎప్పుడూ చూడని వాళ్ళు బొమ్మల్లాగ బిగుసుకుపోగా అతనిని స్వాంతన పరచడానికి కిచెన్‌లోకి వెళ్ళి టీ చేసి తెచ్చింది వందన.

''జంతువులకు టీ ఎందుకూ?'' ఖస్సుమన్నాడు రామం.

''అలా అనకండి, ప్లీజ్! నా తప్పు ఏమిటో చెప్పండి. సరిదిద్దుకుంటాను'' ఏడ్చేసింది వందన. ఆ కన్నీళ్లకు కరిగిపోయినట్టు కనిపించాడు రామం.

''పెళ్ళి చూపుల్లో నిన్ను చూసి ముచ్చటపడ్డాను. తెలివైనదానివనీ, నీ చేతిలో మన కుటుంబం భద్రంగా ఉంటుందనీ భావించాను. నా తల్లిదండ్రులు సౌజన్యమూర్తులు వారికి మన స్తాపం కలగకుండా నడుచుకోవాలి. వాళ్ళు మనతోనే ఉంటారు. మనం ఆదర్శప్రాయంగా ఉండాలి అని పెళ్ళి చూపుల్లో చెబితే నువ్వు అంగీకరించావు. కానీ ఇప్పుడేమయింది? నీ తల్లి దుర్బోధలకు తల ఒగ్గి జంతువిధానం మంచిదనే స్థాయికి దిగజారావు. నా నుంచి నా తల్లిదండ్రుల్ని దూరం చేశావు. ఈ విషయం నాకు తెలియకుండా దాచి పెట్టి నన్నో వెధవని చేశావ్. నీ మీద నాకున్న నమ్మకాన్ని వమ్ముచేశావు. నిన్ను గుడ్డిగా నమ్ముతూ ఎంత కాలం వెధవలాగ పడి ఉండేవాడినో. పితృసమానుడైన ఒక సౌజన్యమూర్తి ఈ రోజు నన్ను తట్టి లేపాడు. ఆయనేం చెప్పాడో తెలుసా?''

అంత వరకూ సౌమ్యంగా మాట్లాడిన రామం ఒక్కసారిగా భావోద్వేగానికి లోనై రెచ్చిపోయి ఠంగున సోఫాలోంచి లేచి భార్య భుజాలు పట్టి కుదిపేస్తూ-

''రాక్షసీ నమ్మక ద్రోహీ నా తల్లిదండ్రులు ఆరు నెలల క్రితమే కాకినాడకు మకాం మార్చినా తెలియని దౌర్భాగ్య కూపం లోకి నన్ను నెట్టేశావు కదే. అక్కడ మా నాన్న ఏం చేస్తున్నారో తెలుసా? రోడ్లు ఊడ్చడం! దీనంతటికీ నువ్వే కారణం. నువ్వే నువ్వే'' గర్జించాడు.

అతని చేతుల్లో ఆమె భుజాలు నలిగిపోతోంటే విలవిలలాడి పోతోందామె. అతని కుదుపులకు ఆమె గుండె ఆగిపోయేట్టుంది. భయవిహ్వలంగా ఆమె రోదిస్తోంటే అప్పటికి చలనం కలిగిన జగదాంబ చెంగున అక్కడికి దూకి ''అమ్మాయిని చంపేస్తావా ఏమిటి?'' అని అరుస్తూ వందనను పక్కకి లాగేసింది.

''జంతువిధానం అదే అత్తయ్యా కోపం వస్తే కుమ్ముకుంటాయి. పొడుచుకుంటాయి. చంపుకుంటాయి. మనుషులు కంటే జంతువులే నయం కదా మీ దృష్టిలో'' వెటకారంగా అన్నాడు రామం.

వందన ఫ్రెండ్స్ నోట వెలువడిన డైలాగుల రచన, దర్శకత్వం తనవే. ఆ డైలాగులు అల్లుడికెలా తెలిశాయో అర్థం కాకపోయినా నష్ట నివారణకు పూనుకుంది జగదాంబ. ''ఏమిటిది అల్లుడుగారూ మీ మాటలు మా కర్థం కావడంలేదు. మేమే పాపం ఎరగము. మీ కెవరు చెప్పారో గాని మేమెప్పుడూ అలా అనలేదు. అన్నయ్యగారు, వదినగారూ కాకినాడ కొచ్చేశారా? అన్నయ్యగారు పాకీ పని చేస్తున్నారా! మాకు తెలియనే తెలియదు. ఆయనకేం లోటు? ఇంటి అద్దెతో, పెన్షన్‌తో దర్జాగా జీవించవచ్చు కదా. ఏదో మనసులో పెట్టుకొని, మీ పరువూ మా పరువూ తీసి బ్లాక్‌మెయిల్ చేయడానికే ఆయన వీధులూడ్చుతున్నారు కాబోలు. మీరు సుఖంగా ఉండడం చూడలేక మీకు తలవంపులు కలిగించడానికే''

మాట పూర్తికాకుండానే ఆమె చెంప ఛెళ్ళుమంది. పట్టపగలే ఆమెకు చుక్కలు కనిపించాయి. కొట్టింది వేరెవరోకాదు, సాక్షాత్తూ ఆమె భర్త.

చెంపలు నిమురుకుంటూ దిగ్భ్రాంతిగా జగదాంబ, అమ్మని నాన్న కొట్టడం నమ్మలేని దిగ్భ్రాంతిలో వందన ఆయననే చూస్తూ ఉండిపోయారు. హిరణ్యకశిపుని పొట్ట చీల్చిన తర్వాత ఆగ్రహాన్ని అదుపు చేసుకోడానికి ప్రయత్నిస్తున్న ఉగ్రనరసింహస్వామి లాగ కనిపించాడాయన.

''మామయ్యా మీరు మీ భార్యను తీసుకొని వెంటనే వెళ్ళిపోండి. మళ్ళీ రాకండి. నా తల్లిదండ్రులకు స్థానం లేని ఇంట్లో మీకూ స్థానం ఉండదు'' ఖంగుమంది రామం స్వరం.

అతని మాటల కెలా స్పందించాలో అర్థంకాక ఒకరి ముఖం ఒకరు చూసుకుంటూ ఉండిపోయారందరూ.

''మంచితనం, మానవత్వం ఉన్న మనిషి లాగ జీవించాలనుకుంటే ఈ ఇంట్లో ఉండు. జంతువులే నయం అనుకుంటే నీ ఇష్టం వచ్చిన చోటుకి పో'' అన్నాడు రామం భార్యనుద్దేశించి.

భర్త వైపొకసారి నిశ్చలంగా చూసింది వందన. తర్వాత తల్లిదండ్రుల వైపు చూసింది. వెంటనే ఒక నిర్ణయానికి వచ్చిన దానిలా ''అమ్మా నువ్వు నాన్నతో వెళ్లిపో. మళ్ళీ మా ఇంటికి రాకు'' అంది దృఢంగా.

చిరునవ్వు బయట పడకుండా గుండె లోతుల్లోకి నొక్కేసి ''సూటుకేసు తెచ్చుకో పద'' అన్నాడు నారాయణ భార్యతో.

వాళ్లు వెళ్ళిపోతూంటే చూస్తూ ఉండిపోయారు రామం, వందన.

ఇంట్లో ఏం జరుగుతున్నదో తెలియని స్థితిలో నిద్రపోతున్న తనని తట్టిలేపి కర్తవ్యం బోధించిన సౌజన్యమూర్తి నుద్దేశించి ''థాంక్స్ మామయ్యా'' అనుకున్నాడు రామం సంతృప్తిగా.

గబగబా లోనికెళ్ళి సూటుకేస్‌తో వచ్చిన వందన ''పదండి, మనమూ వెళ్దాం'' అంది మృదువుగా.

''ఎక్కడికి?'' ఆశ్చర్యపోయాడు రామం.

''కాకినాడకు నా పాప ప్రక్షాళన కోసం'' అంది కన్నీళ్ళతో.

ఆమెను ఎగాదిగా చూసి దగ్గరగా లాక్కుని కన్నీళ్ళు తుడిచాడు రామం తన పెదవులతో.

★